



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



వైభవంగా చాముండేశ్వరి రథోత్సవం

బెంగళూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మైసూరు చాముండి కొండలపై వెలసిన చాముండేశ్వరీదేవి రథోత్సవం వేలాదిమంది భక్తుల జయధ్వానాల మధ్య సోమవారం అంగరంగ వైభవంగా సాగింది. దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత చాముండేశ్వరీదేవి రథోత్సవం జరపడం ఆనవాయితీ. ఒడయార్ రాజ వంశానికి చెందిన యువరాజు యధువీర కృష్ణదత్త చామరాజ ఒడయార్, రాజమాత ప్రమోదాదేవితో పాటు యధువీర్ భార్య త్రిషికా కుమారి తదితరులు ఉదయమే ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సిద్ధం చేసిన రథంపై చాముండేశ్వరీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠ చేశారు. యువరాజు రథం లాగి ప్రారంభించడంతో ఆలయం చుట్టూ రథోత్సవం జరిగింది. చాముండేశ్వరీదేవి మూల విగ్రహానికి సింహవాహిని అలంకరణ చేశారు. ఆలయాన్ని రంగుల పూలతో ప్రత్యేకంగా ఆలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రథంపైకి అరటిపళ్ళు, ధవనం సమర్పించారు. ఇదే సందర్భంగా యువరాజు, ఎంపీ యధువీర్ మాట్లాడుతూ ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయని అదే తరహాలోనే రథోత్సవంలో పాల్గొనేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారన్నారు. విజయదశమి రోజున గజరాజుపై చాముండేశ్వరీదేవి ఊరేగింపు సందర్భంగా అతిరథులు పుష్పార్చన చేసే వేళ 21 రౌండ్‌లు గాలిలోకి కాల్పులు జరిపే సంప్రదాయం తరహాలోనే రథోత్సవంను రాజకుటుంబం ప్రారంభించేముందు ఫిరంగిదళ సిబ్బంది 21వ రౌండ్‌లు గాలిలోకి కాల్పులు జరిపారు. కాగా జంబూసవారీను ఈఏడాది సోషల్ మీడియా ద్వారా 22లక్షల మంది తిలకించారని ఆలయ వర్గాలు ప్రకటించాయి.



పురవీధుల్లో సాగుతున్న రథోత్సవం



సమాజం మెచ్చిన మానవతావాది

● వయసులో పెద్దవారైనా ఇద్దరి అభిప్రాయాలు ఒకటే ● ఇప్పటికీ ప్రజాసంక్షేమమే ఆయన లక్ష్యం
● సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ జన్మదిన వేడుకల్లో ఏపీ డీసీఎం పవన్ కల్యాణ్

బెంగళూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి మానవత్వంతో వ్యవహరిస్తే సమాజంలో ఎన్నో సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమని దేశంలోనే అత్యున్నతమైన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించినా బడుగు వర్గాల కోసం ఆలోచించిన వ్యక్తి వి. గోపాలగౌడ అంటూ ఏపీ డీసీఎం పవన్‌కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. సోమవారం విధానసౌధలోని బ్యాంక్వెట్ హాల్‌లో మాజీ జస్టిస్ గోపాలగౌడ 75వ జన్మదిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మానవతావాది పేరుతో గోపాలగౌడ జీవితంపై రూపొందిన ప్రత్యేక పుస్తకాన్ని రాష్ట్ర శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి హెచ్‌కే పాటిల్, డీసీఎం పవన్‌కళ్యాణ్ తదితరులు ఆవిష్కరించారు. సుప్రీం కోర్టు మాజీ సీజే జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తన సందేశాన్ని వినిపించారు. మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే, మాజీ లోకాయుక్త ఎంకే సుధీంద్రరావ్, ఎమ్మెల్యే జీటీ దేవేగౌడ, సీనియర్ న్యాయవాది శేషాద్రితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, గోపాలగౌడ బంధుమిత్రులు భాగస్వామ్యులయ్యారు. మంత్రి హెచ్‌కే పాటిల్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా గోపాలగౌడ కొన్ని ఆశయాలతో కొనసాగారన్నారు. ఆయన న్యాయవాదిగా, న్యాయమూర్తిగా అందించిన సేవలు, తీర్పులు నేటి యువ న్యాయవాదులకు మార్గదర్శకమన్నారు. డీసీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ గోపాలగౌడ తనకంటే పెద్దవారని అయితే పలువిషయాల్లో మా మధ్యన ఏకాభ్రియం ఉందన్నారు. కన్నడిగులు, తెలుగువారిది సోదర సంబంధమని అందుకే దశాబ్దాల కాలంగా రెండు రాష్ట్రాలకు సంబంధించిన పలు అంశాలలో స్నేహపూర్వకమనే అభిప్రాయం సాగిందన్నారు. ఇటీవలే చిత్తూరు జిల్లాలో ఏనుగులు- మానవ ఘర్షణల నివారణలకు నాలుగు కుంకీ ఏనుగులు అడిగిన వెంటనే ఇచ్చారని ఇక్కడి ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గోపాలగౌడ దశాబ్దాల కాలంగా తనకు పరిచయం ఉన్నవారన్నారు. ఆయన ఏడున్నర దశాబ్దపు వయస్సులోను సమాజం గురించి ఆలోచిస్తున్న విధానం సంతోషం కలుగుతోందన్నారు. ఆయన సాధనలు, ఆలోచనలకు అనగుణంగానే మానవతావాది పేరుతో పుస్తకం రూపొందించడం సంతోషమన్నారు. గోపాలగౌడ మాట్లాడుతూ సమాజం నాకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందని తన వంతు సేవలు అం దించేందుకు నిరంతరం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో గోపాలగౌడతో పలువురి అనుభవాలను పంచుకున్నారు.



జస్టిస్ గోపాలగౌడను సత్కరిస్తున్న డీసీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి సోమణ్ణ



జస్టిస్ గోపాల గౌడను సత్కరిస్తున్న మంత్రి హెచ్‌కే పాటిల్

కోలార్, చిక్కబళ్ళాపుర జిల్లాలకు కృష్ణాజలాలు మళ్లించాలి

● ఉభయ జిల్లాల దాహం తీర్చడానికి 'జలాగ్రహ' పోరాటానికి సిద్ధం
● విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ

5

రహదారుల అభివృద్ధి.. దేశ ప్రగతికి సంకేతం

● రోడ్ల నాణ్యతలో రాష్ట్రం ముందంజ: వై స్పేస్ విశ్రాంతి కేంద్రం శంకుస్థాపనలో ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ

బెంగళూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్లు, రహదారుల అభివృద్ధి దేశప్రగతికి సంకేతమని ఏ ప్రాంతంలో రవాణా సదుపాయం బాగుంటుందో అక్కడికి వెళ్ళేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారని, వ్యాపార, ఉద్యోగాలు మెరుగవుతాయని హొసకోట ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ అభిప్రాయపడ్డారు. బెంగళూరు- చెన్నై జాతీయ రహదారికి అనుబంధంగా వై స్పేస్ సంస్థ నిర్మించదలచిన సకల సౌలభ్యాల విశ్రాంతి కేంద్రానికి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వై స్పేస్ సంస్థ సీఈఓ రత్నకుమార్, జాతీయ రహదారుల విభాగం మేనేజర్ బ్రహ్మాకర్‌తో పాటు పలువురు ముఖ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శరత్ మాట్లాడుతూ రోడ్ల ప్రగతిలో కర్ణాటక ముందంజలో ఉందన్నారు. జాతీయ రహదారుల్లో విశ్రాంతితో పాటు ఆహ్లాదకర వాతావరణంలో రుచికరమైన ఆహారం అందించే హోటళ్ళు ముఖ్యమన్నారు. వై స్పేస్ సంస్థ సీఈఓ రత్నకుమార్ మాట్లాడుతూ బంగారుపేట తాలూకా కారహళ్ళి గ్రామపంచాయితీ కల్కెర గ్రామం రానున్న కాలంలో పర్యాటక కేంద్రం కానుందన్నారు. ఇక్కడ 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రయాణీకులు విశ్రాంతి తీసుకునేందుకు అనువైన సౌలభ్యాలు తీసుకువస్తామన్నారు. బెంగళూరు- చెన్నైల మధ్యన నిర్మిస్తున్న రహదారి ప్రయాణ సమయం ఆరు గంటల నుంచి మూడుగంటలకు తగ్గనుందన్నారు. అందుకే ప్రయాణీకులు విశ్రాంతి పొందేందుకు అనువుగా అంతర్జాతీయ సౌలభ్యాలతో కేంద్రాన్ని తీరుస్తామన్నారు. ఇదే ప్రదేశంలోనే 150 అడుగుల అభయ ఆంజనేయ స్వామివిగ్రహం రానుందని తద్వారా ఆధ్యాత్మిక కేంద్రంగా కూడా మారనుందన్నారు. ఈ రహదారి నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం రెండువేల కోట్లు ఖర్చు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఉపరితల రవాణా శాఖా మంత్రి నితిన్‌గడ్కరీలు ప్రత్యేక చొరవతోనే రహదారి సాధ్యమైందన్నారు. నిర్మాణాలు పూర్తి అయితే విమానం కంటే వేగంగా రహదారి ద్వారానే రెండు రాష్ట్రాల మధ్య రవాణాకు అనుకూలం కానుందన్నారు. ఎనిమిది లక్షల కోట్ల వ్యాపార వ్యవహారాలు పెరగనున్నాయని కనీసం 20లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్రాంతి కేంద్రం ద్వారా 600ల మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు సాధ్యం కానున్నట్లు రత్నకుమార్ తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్చన, సోమశేఖర్, ఏపీ డీజీపీ సాంబశివ, విజయా బ్యాంక్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామారావ్, రామ నాథ్, రవి, మల్లికార్జున, దయాకర్, రామనాథ్, శ్రీనివాస్, దిలీప్, ప్రశాంత్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్‌కుమార్, డీఎస్పీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శరత్, వై స్పేస్ సీఈఓ తదితరులు



కొత్త వాహనాలకు పచ్చజెండా ఊపుతున్నముఖ్యమంత్రి సిద్దరామయ్య

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: సీఎం

● 68 కొత్త వాహనాలను ప్రారంభించిన సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరు బాధ్యతగా భావించాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి విభాగానికి రాష్ట్ర వ్యాప్తంగా వినియోగానికి 68 కొత్తవాహనాలను సోమవారం లాంఛనంగా ముఖ్యమంత్రి విడుదల చేశారు. విధానసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కాలుష్య నియంత్రణమండలి చైర్మన్ ఎమ్మెల్యే నరేంద్రస్వామి అధ్యక్షత వహించారు. ఇదే సందర్భంగా నరేంద్రస్వామి మాట్లాడుతూ మహేంద్ర కంపెనీకి చెందిన 48 బొలేరో వాహనాలను బెంగళూరు మినహా అన్ని జిల్లాలకు కేటాయించామన్నారు. బెంగళూరు కోసం ఎలక్ట్రికల్ వాహనాలను కొనుగోలు చేశామన్నారు. 68 వాహనాల కొనుగోలుకు రూ.7.67 కోటు కేటాయించామన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఈశ్వర్‌ఖండ్రే, శరణప్రకాష్ పాటిల్, జమీర్‌అహ్మద్‌ఖాన్‌తో పాటు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.



వాహనాల వద్ద కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ నరేంద్రస్వామి

తెప్ప బోల్తా.. ఇద్దరి గల్లంతు

బెంగళూరు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): దావణగెరె జిల్లా హొన్నాళి పట్టణ శివారు ప్రాంతంలోని తుంగభద్ర నదిలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. నదిలో నుంచి ఇసుక తీసుకువచ్చేందుకు వెళ్ళిన సందర్భంలోనే తెప్ప బోల్తాపడి ఇద్దరు కార్మికులు గల్లంతయ్యారు.. హొన్నాళి పట్టణానికి చెందిన తిప్పేశ్(25), ముక్తియార్(19)లు మృతి చెందినట్లుగా స్థానికులు అభిప్రాయపడ్డారు. నదిలోనుంచి ఇసుకను తీసుకువచ్చి విక్రయించడంతో పాటు చేపల వేట చేసేవారిని పోలీసులు తెలిపారు. ఇలా నది మధ్యకు వెళ్ళినప్పుడు ఒక్కసారిగా తెప్ప బోల్తా పడటంతో వారు నది నుంచి బయటపడలేక మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. హొన్నాళి పోలీసులు, అగ్నిమాపకశాఖ సిబ్బంది ఇద్దరి మృతదేహాల కోసం గాలింపు జరుపుతున్నట్లు తెలిపారు.



గాలింపు చర్యల్లో స్థానికులు

నవంబరులో క్రాంతి.. భ్రాంతి లేదు

కులగణనతో ఎవరినీ తొక్కేది లేదు : సీఎం సిద్దరామయ్య

5



కీర్తన (ఫైల్), కూలిన చెట్టు

చెట్టు కూలి యువతి దుర్మరణం

బెంగళూరు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం సోలదేవనహళ్ళి ప్రాంతంలో ఓ భారీ చెట్టుకూలడంతో ద్విచక్రవాహనంలో వెళుతున్న ఓ యువతి అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం రాత్రి సోలదేవనహళ్ళి నుంచి వస్తున్న వేళ చెట్టుపడటంతో హెబ్బాళ ప్రాంతానికి చెందిన కీర్తన(24) దుర్మరణం చెందారు. మరో వాహనంలో వెళుతున్న భాస్కర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం సెలవు కావడంతో కీర్తనతో పాటు మిత్రులు శాండిల్‌వుడ్ ప్రీమియర్ క్రికెట్ టోర్నీ చూసేందుకు వెళ్ళారు. అక్కడి నుంచి వెనుదిరిగి వస్తున్న సమయంలోనే చెట్టు కూలింది. కీర్తనపై చెట్టుకొమ్మలు పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే గమనించిన స్థానికులు కొమ్మలను తాత్కాలికంగా తొలగించి క్షతగాత్రులను రక్షించే ప్రయత్నం చేశారు. భాస్కర్‌కు తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారు స్వల్పగాయాలతోనే బయటపడ్డారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీ అధికారులు సందర్శించి సహాయక చర్యలు కొనసాగించారు.

రివర్స్ చేస్తుండగా కారు ఢీ చిన్నారి మృతి

బెంగళూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం కామాక్షిపాళ్య పోలీసుస్టేషన్ పరిధిలో ఘోర సంఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం ఇంటి నుంచి కారును బయటకు తీసేవేళ రివర్స్ చేస్తుండగా వెనుక వైపు ఆటలాడుతున్నవేళ చిన్నారిని గమనించికపోవడంతో ప్రమాదం జరిగింది. కారు ఢీకొట్టడంతో కిందపడిపోగా కారు చక్రం కింద 11నెలల అజాన్ అనే చిన్నారి చిక్కుకుపోయింది. చిన్నారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. చిన్నారి కుటుంబం ఆ ఇంట్లో అద్దెకు ఉన్నారు. ఇంటి యజమాని కారు రివర్స్ చేస్తుండగానే ప్రమాదం జరిగింది. కారు కింద పడ్డ చిన్నారిని గమనించకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విషయం తెలిసిన మేరకు కామాక్షి పోలీసులు కేసు నమోదు చేసుకుని ఇంటి యజమాని ప్రమాద కారకుడు స్వామి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కారు తీసే ముందు అతడు వెనుక గమనించికపోవడంతో పాటు కనీసమైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

చెన్నై హైవేపై రోడ్డు ప్రమాదం

● ముగ్గురు మృత్యువాత ● క్షతగాత్రులను తరలిస్తుండగా అంబులెన్స్ డ్రైవర్....



ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న అధికారులు

బంగారుపేట, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): బెంగళూరు, చెన్నై జాతీయరహదారి బంగారుపేట తాలూకా కల్కెరె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ముగ్గురు దుర్మరణం చెందారు. క్షతగాత్రులను తరలించే ప్రయత్నంలో అంబులెన్స్ డ్రైవర్ మృత్యువాత పడడం విషాదం మిగిల్చింది. గ్రామం వద్ద ఓ శంకుస్థాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్నవారికి తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి, కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లాకు చెందిన వారు 24 మంది వచ్చారు. సోమవారం సాయంత్రం 407 వాహనంలో బెంగళూరు వైపు వారంతా బయల్దేరారు. వాహనం మలుపు తిరుగుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఇదే సమయంలో నే ఓ క్యాంటర్ వాహనం వేగంగా వచ్చి బోల్తా పడిన వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో శివరాజు(40), అశోక్(38) అక్కడికక్కడే మృతిచెందగా విక్రమ్ పాల్(43) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. క్షతగాత్రులను తరలించేందుకు హైవే అంబులెన్స్ ప్రమాదస్థలికి చేరింది. గాయపడ్డవారిని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న సమయంలోనే వెనవైపు నుంచి వచ్చిన మరో క్యాంటర్ వాహనం ఢీ కొనడంతో అంబులెన్స్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. అతని వివరాలు తెలియరాలేదు. గాయపడ్డవారిలో 11 మందిని కేజీఎఫ్ ఆస్పత్రికి, 10 మందిని బంగారుపేట ఆస్పత్రికి తరలించారు. కేజీఎఫ్ తహసీల్దార్ సుధాకర్‌తో పాటు పోలీసులు ఆస్పత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న కియ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫెసిలిటీ, కన్‌స్ట్రక్షన్, సేఫ్టీ హెడ్ సాంగ్జీ కిం



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం బూరుగుపల్లికి చెందిన గ్రీన్ అంబాసిడర్ ఎస్ దొడ్డప్ప

కోడిబాయె లచ్చమ్మదీ..!

నాటు కోళ్లు మాయం చేస్తున్న ఆ ఇద్దరు

క్వార్టర్ మందు.. రూ.200 ఇస్తే చాలు.. సరఫరా

శింగనమలలో తరచూ బాధితులతో గొడవలు

పోలీసులకు ఫిర్యాదు వెళ్లినా.. మందలింపుతో సరి

శింగనమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నాటు కోడి కంటపడితే మాయం చేసేస్తున్నారు ఇద్దరు యువకులు. తెలిసినవాళ్లు ఫోన్ చేసి.. 'రేయ్ మామా.. కోడి..' అని అడిగిందే తడవు సరఫరా చేస్తున్నారు. వీరి దెబ్బకు ఇళ్ల వద్ద నాటు కోళ్లను పెంచుకునేవారు బెంబేలెత్తిపోతున్నారు. దొంగ కోళ్ల వ్యవహారం పోలీసుల వరకూ వెళ్లినా తేలిగ్గా తీసుకుంటున్నారు. 'కోడే కదా..' అని మందలింపుతో సరిపెడుతున్నారు. దీంతో ఆ ఇద్దరూ పేట్రేగిపోతున్నారని బాధితులు వాపోతున్నారు.



బస్టాండ్‌మే సవాల్..

సెప్టెంబరు 28వ తేదీ ఆదివారం..! పట్టణానికి చెందిన రామాంజనేయులు, చంద్రకళ దంపతుల నాటు కోళ్లు మాయమయ్యాయి. వారు వీధి కెక్కి తిట్ల దండకం ఎత్తుకున్నారు. ఆ దెబ్బకు మాయమైన కోళ్లు ఓ ఇంటి నుంచి కూత పెట్టుకుంటూ బయటకు పరిగెత్తుకు వచ్చాయి. ఆ ఇల్లు.. ఆ ఇద్దరు యువకుల బంధువులదట. దీంతో ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆ ఇద్దరు యువకులను రామాంజనేయులు నిలదీశాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తాని హెచ్చరించాడు. దీంతో గొడవ ముదిరి.. 'అవును.. మీ కోళ్లను మీమే తీసుకుపోయాం. ఇప్పుడు వదిలేశాం. మళ్లీ పట్టుకుపోతాం.. ఏం చేసుకుంటారు..?' అని ఆ యువకులు ఎదురు తిరిగారు. గొడవ ముదిరి పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లింది. కోళ్లను దొంగతనం చేసింది కాక తమపై దాడి చేశారని దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మందు బాటిల్ ఇస్తే చాలు..

దొంగ కోళ్ల వ్యవహారం శింగనమలతోపాటు గుత్తి మండలం, కర్నూలు జిల్లాకూ విస్తరించినట్లు సమాచారం. మార్కెట్‌లో 'పల్లె నాటు'కు డిమాండ్ కూడా భారీగా ఉంది. ఈ లెక్కన దొంగ కోళ్లను పట్టుకుని ఆ ఇద్దరు యువకులు బాగా సంపాదిస్తున్నారేమో అనుకుంటే 'కోడి కూరలో కాలేసినట్టే..! ఓ రూ.200 నగదు.. క్వార్టర్ బాటిల్ మందు ఇస్తే చాలు.. నాటు కోడిని ఇచ్చేస్తారట. నాటు కోడి తినాలని అనిపిస్తే చాలు 'రేయ్ తమ్ముడూ.. నోరు చెడిపోయింది..', 'రేయ్ మామా.. ఫ్రెండొచ్చాడు..' అని ఫోన్ కొడతారట. బంధువులు, ఫ్రెండ్స్ వచ్చినా, బర్త్ డే పార్టీ అయినా.. చివరకు మూడ్ బాగాలేకపోయినా 'కస్టమర్లు' వీరిని సంప్రదిస్తున్నారట. నాటు కోడి రుచి చూడాలని అనుకునేవారికి ఈ ఇద్దరూ బెస్ట్ సర్వీస్ చేస్తున్నారని ప్రచారం ఉంది. కనీసం రూ.1000 పెడితేగానీ దొరకని నాటుకోడిని వీరు రూ.200కే ఇచ్చేస్తున్నారని సమాచారం. కస్టమర్లు వీరిని లైన్‌లో పెట్టుకునేందుకు మందు బాటిల్‌ను కానుకగా ఇస్తున్నారని అంటున్నారు. అదీ.. ఓ సినిమా హీరో వాడే బ్రాండ్ అట..! ఈ ఇద్దరికి ఇద్దరు పోలీసులతో సత్సంబంధాలు ఉన్నాయనే ప్రచారం ఉంది.

రేయ్.. మా పేరు చెప్పకండ్రా..

పది రోజుల క్రితం బస్టాండు వద్ద జరిగిన దొంగ కోళ్ల గొడవ స్టేషన్ వరకూ వెళ్లడంతో ఆ ఇద్దరు యువకులను పోలీసులు పిలిపించారు. దీంతో తమ పేర్లు ఎక్కడ బయట పెడతారోనని దొంగ కోళ్లను వండుకుతిన్నవారు బెంబేలెత్తిపోయారు. ఏం జరుగుతుందో చూద్దామని కొందరు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి పరిణామాలను గమనించారు. మరికొందరు తెలిసినవారి చేత పోలీసులకు ఫోన్‌లు చేయించుకున్నారని సమాచారం. కేసు కట్టకపోయినా, ఆ రోజు నుంచి ఆ ఇద్దరు యువకులు స్టేషన్‌కు వచ్చి పోతున్నారు. దీంతో 'రేయ్.. మా పేరు చెప్పకండ్రా..' అని 'రుచి చూసినవారు' బతిమాలుతున్నారట.

కేసు నమోదు చేస్తాం..

నాటు కోళ్ల విషయంలో దాడి జరిగినట్లు ఫిర్యాదు వచ్చింది. పది రోజులుగా తిరుమల విధుల్లో ఉన్నాం. ఇన్‌చార్జి ఎస్ఐ ఉన్నందున కేసు నమోదు చేయలేదు. ఇద్దరు యువకులపై గతంలోనూ ఫిర్యాదులు ఉన్నాయని తెలిసింది. విచారించి కేసు నమోదు చేస్తాం.


- విజయ్‌కుమార్, ఎస్ఐ, శింగనమల

ఇది రైతేనా..?

పీఏబీఆర్ కుడికాలువపై నిర్లక్ష్యం

- పెరిగిన కంపచెట్లు .. దెబ్బతిన్న గట్లు
- నీరు వదిలితే ముందుకు సాగడం కష్టం
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

కూడేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ (పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) కుడి కాలువ పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ పీఏబీఆర్ నుంచి ధర్మవరం చెరువు వరకు 113 కిలోమీటర్ల దూరం ఉంది. కంపచెట్లు పెరగడంతో కాలువ గట్టు దెబ్బ తింది. అండర్ బ్రిడ్జిలకు రంధ్రాలు పడి, సైడ్ వాల్ కుంగిపోయింది. మరమ్మతులు చేయకపోవడంతో వచ్చిన నీరంతా వంకలపాలవుతోంది. పీఏబీఆర్ నీటిని దాదాపు 48 చెరువులకు తరలించేందుకు కుడికాలువను ఏర్పాటు చేశారు. అయితే దీని పర్యవేక్షణను గాలికొదిలేయడంతో కాలువ పూర్తిగా దెబ్బతింది. డ్యాం నుంచి 25వ కిలోమీటరు వరకు కాలువ పూర్తిగా దెబ్బతింది. డ్యాం నుంచి 15వ కిలోమీటరులోపు ఎక్కువ నీరు లీకై వంకల్లోకి వెళుతోంది. జల్లిపల్లి సమీపంలోని 4వ కిలోమీటర్ వద్ద గొరవయ్యదార్ల వద్ద అండర్ బ్రిడ్జికి భారీ రంధ్రాలు పడ్డాయి. దీనికి తోడు సైడ్ వాల్ పూర్తిగా కుంగిపోవడంతో భారీగా నీరు బయటకు వెళ్తున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. 6వ కిలోమీటరు వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కాలువ వెళ్లే దారిలో ఉన్న వంకల వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జిలు ఎక్కువగా అటవీ ప్రాంతంలో ఉండటంతో వాటి మరమ్మతులు సక్రమంగా చేయలేదు. కాలువకు నీరు వదలిన సమయంలో ఇరిగేషన్ అధికారులు నానా హడావుడి చేస్తారు. నీరు బయటకు వెళ్లే ప్రదేశంలో ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. నీరు నిలిచిన తర్వాత అటు వైపు కన్నెత్తి చూడరు. దీంతో కాలువకు ఇరువైపులా కంప చెట్లు పెరిగిపోయాయి. కాలువ మధ్యలో పిచ్చి మొక్కలు, జనుము గడ్డి ఏపుగా పెరగడం, కాలువ సైడ్ వాల్ దెబ్బతిని రాళ్లు కాలువలో పడి నీటి ప్రవాహాన్ని నిరోధిస్తున్నాయి. దీంతో చెరువులకు నీరు చేరక రైతులు ఇబ్బంది పడుతున్నారు.



కుడికాలువ గట్లపై పెరిగిన కంపచెట్లు



4వ కిలోమీటరు వద్ద అండర్ బ్రిడ్జికి ఏర్పడ్డ రంధ్రం

రూ.కోటిన్నరతో ప్రతిపాదనలకు పంపితే...

డ్యాం నుంచి 25 కిలోమీటరు వరకు ఒక సబ్ డివిజన్, 26 నుంచి 113 కిలోమీటరు వరకు మరో సబ్ డివిజన్‌గా విభజించారు. దీంతో డ్యాం నుంచి 25 కిలోమీటరులోపు దెబ్బతిన్న కాలువ మరమ్మతులు చేయడానికి రూ.కోటిన్నరతో 13 పనులకు ప్రతిపాదనలు పంపితే రూ.8 లక్షలతో కంపచెట్లు తొలగించడం, లీకేజీల నివారణ పనులకు నిధులు కేటాయించారు. మిగిలిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో తిరిగి ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

113 కిలోమీటరు వరకు రూ.రెండు కోట్లు మంజూరు..

పీఏబీఆర్ కుడికాలువ 26 కిలోమీటరు నుంచి 113 కిలోమీటరు వరకు దాదాపు రూ.2 కోట్లతో 23 పనులు మంజూరు అయ్యాయి. దీంతో కాలువ పనులు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాలువకు నీరు వదిలితే అత్యధికంగా నీరు వృథాగా బయటకు వెళ్లే ప్రదేశం కూడేరు మండలంలోనే ఉంటుంది. ఉన్నతాధికారులు నీటి వృథాను అరికట్టేందుకు పనులు మంజూరు చేయకపోవడం గమనార్హం.



నాలుగున్నర కిలోమీటరు వద్ద దెబ్బతిన్న కాలువ గట్టుకు వేసిన ఇసుక బస్తాలు

నీటి వృథాని అరికట్టాలి



డ్యాం నుంచి జల్లిపల్లి గ్రామం వరకు నీరు పెద్ద ఎత్తున లీకై వృథాగా వంకలోకి వెళ్తుంది. అండర్ బ్రిడ్జిలకు పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడి నీరు బయటకు వచ్చి వంకలోకి చేరుతోంది. అలాగే పొలాల్లోకి నీరు చేరుతుండటంతో పంటలు సాగు చేయడానికి అవకాశం లేకుండా పోతోంది. కాలువ దెబ్బతిన్న ప్రాంతంలో మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలి.

- చంద్ర, రైతు, ఉదిరిపికొండ

త్వరగా నీరు విడుదల చేయాలి



పీఏబీఆర్ డ్యాం నుంచి కుడికాలువ ద్వారా చెరువులను పూర్తి స్థాయిలో నీటితో నింపాలి. వేసవి కాలంలో నీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ముందస్తుగా చెరువుల్లో నీటిని నింపితే మూగజీవాలతోపాటు ప్రజలకు దాహం తీరుతుంది. చెరువులో నీరు ఉండటం వల్ల భూగర్భ జాలలు పెరిగి, బోరుబావులు ఎండిపోకుండా ఉంటాయి. దీంతో అన్నదాతలు సాగు చేసిన పంటలకు నీటి గండం తప్పుతుంది. అధికారులు త్వరగా కుడికాలువకు నీరు విడుదల చేయాలి. -కృష్ణమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం

ఏరికోరి..!

- డిప్యూటీ ఎంపీడీఓ స్థానం కోసం తీవ్రపోటీ
- వారంలోపు పలువురికి ప్రమోషన్లు
- ఏరి కోరుకుంటున్న ఆశావహులు
- ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓ స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొంది. కోరుకున్న స్థానం దక్కించుకునేందుకు ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎంపీడీఓ స్థానాలను భర్తీ చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే అర్హులైన వారి నుంచి ఏసీఆర్ (యానివల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్)లు కూడా సేకరించింది. వారం లోపే ప్రమోషన్ల ప్రక్రియ ముగించి ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రమోషన్ తథ్యమనుకున్న ఆశావహులు కోరుకున్న స్థానం దక్కించుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రధానంగా అనంతపురం జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉండే రాప్తాడు డిప్యూటీ ఎంపీడీఓ స్థానానికి గట్టి పోటీ నెలకొన్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నట్లు తెలిసింది.

ఖాళీలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓ ఖాళీలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, రాప్తాడు, రామగిరి, రొద్దం, మడకశిర, రొళ్ల, అమరాపురం, పెనుకొండ, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల, కొత్తచెరువు, నల్లచెరువు, కదిరి, తలుపులకు ప్రస్తుతం ఇన్‌చార్జులుగా డిప్యూటీ ఎంపీడీఓలు ఉన్నారు. బ్రహ్మసముద్రంలో పని చేస్తున్న మాధవికి ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి రావడంతో ఆ స్థానం ఖాళీ అయింది. పెనుకొండలో కమళాబాయి, నల్లచెరువులో శకుంతల, రాప్తాడులో ఆనంద్ ప్రసాద్‌కు కొన్ని రోజుల కిందట ఎంపీడీఓగా ప్రమోషన్ ఉత్తర్వులు రావడంతో డిప్యూటీ ఎంపీడీఓ సీట్లు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు ఆ స్థానాలను కూడా ప్రమోషన్ పొందే వారితో భర్తీ చేయనున్నారు.

ప్రమోషన్ జాబితాలో కార్యదర్శులు ఇలా...

జిల్లాలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తూ డిప్యూటీ ఎంపీడీఓ ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న వారి జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి పంపారు. వారిలో చంద్రశేఖర్, సాదిక్‌వలి, సాదిక్, అశోక్ బాబు, గోపాల్, శ్రీనివాసరెడ్డి, ప్రేమ్‌కుమార్, ఎమ్ఎల్ఎన్ ప్రసాద్, ఎంవీ ప్రసాద్, సుధాకర్ కుమార్, భాస్కర్, అబ్దుల్ మునాఫ్, ఇబ్రహీం, ఎర్రిస్వామి, ఏవీ రమణ, బాబురావు ఉన్నారు. డీపీఓ కార్యాలయం ప్యానల్ నుంచి సీనియర్ అసిస్టెంట్లు మనోహర్, శివప్రసాద్ ఉన్నారు. జిల్లా పరిషత్ ప్యానల్ నుంచి సీనియర్ అసిస్టెంట్లు అచ్చితానంద బాబు, లెక్కలు శ్రీనివాసులు, రంగనాయకులు, హనుమంతు, మల్లికార్జున, రాజశేఖర్ ఉన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ప్రమోషన్లను కాదనుకుని ఏఓలుగా వెళ్లడానికి మల్లికార్జున, హనుమంతు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో జిల్లా పరిషత్ ప్యానల్ నుంచి నలుగురు బరిలో ఉన్నారు. ఆయా వర్గాల నిష్పత్తులకు అనుగుణంగా వారంలోపు 10 మంది జాబితా విడుదల చేసి, మిగిలినవి త్వరలో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.



డీపీఓ కార్యాలయం

ప్లేస్‌మెంట్ కోసం పోటీ

ప్రస్తుతం ప్రమోషన్లు పొందే ఉద్యోగుల్లో ప్లేస్‌మెంట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా రాప్తాడుకు సంబంధించి ఐదుగురు పోటీ పడుతున్నట్లు సమాచారం. స్థానిక ఎంపీడీఓ మాత్రం జడ్పీ ప్యానల్ నుంచి వచ్చే సీనియర్ అసిస్టెంట్ అచ్చితానందబాబునే డిప్యూటీ ఎంపీడీఓగా ఖరారు చేయించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. కార్యదర్శుల నుంచి అశోక్‌బాబు, గోపాల్, ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్ లు కూడా ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నట్లు సమాచారం. పెనుకొండ, గోరంట్ల, కొత్తచెరువు, కదిరి ప్రాంతాలకు కూడా డిమాండ్ ఉంది. ఎవరి పరిధిలో వారు స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. వారు కోరిన ప్లేస్‌మెంట్ దొరికితే లక్షల్లో ముడుపులు ముట్టచెప్పడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ధర చెప్పకపోతే ఒప్పుకోం

- భూసేకరణపై రైతులు
- అధికారుల తీరుపై నిరసన



రోడ్డుపై బైఠాయించిన రైతులు

హిందూపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): 'పరిశ్రమలకు మేం వ్యతిరేకం కాదు. అయితే ఉన్నతాధికారులు రాకుండా వీఆర్‌ఓలతోనే భూసేకరణ చేస్తామంటే ఒప్పుకునే పరిస్థితి లేదు. ధర ఎంతో చెప్పకుండా పాసుపుస్తకాలు, అకౌంట్ పుస్తకాలు అడగడం ఏంటి' అని రైతులు ప్రశ్నిస్తున్నారు. హిందూపురం మండలం చలివెందుల, మలుగూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం భూసేకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఇప్పటి వరకు అక్కడ గ్రామసభలు పెట్టినా ఉన్నతాధికారులు వెళ్లకుండా వీఆర్‌ఓలతోనే సరిపెట్టడంపై ఆయా గ్రామాల రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం మండలంలోని చలివెందుల, మలుగూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో 12పల్లెలకు సంబంధించిన 8వేల ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇందుకోసం భూములు సేకరిస్తున్నట్లు అధికారులు సంబంధిత రైతులకు చెప్పారు. కానీ ఇప్పటి వరకు ధర చెప్పలేదు. అయితే నందమూరి నగర్ వద్ద సోమవారం గ్రామసభ పెట్టి భూమి పాసుపుస్తకాలు, ఆధార్, బ్యాంక్ ఖాతా పుస్తకాలు తీసుకురావాలని దండోరా వేయించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో హిందూపురం-గోరంట్ల ప్రధానరహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న గ్రామాల పరిధిలో నాలుగు వరుసల జాతీయరహదారి నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం ఎకరాకు రూ.29లక్షలు నష్టపరిహారం ఇచ్చారు. రైల్వే లైనుకు సేకరించిన భూమికి కూడా అదే ధర చెల్లించారు. ఇప్పుడు అదే తరహాలో పరిశ్రమల కోసం సేకరిస్తున్న భూములకు ధర ఇస్తామంటే అభ్యంతరం లేదన్నారు.

వాణిజ్య పంటలున్న భూములు వదిలేయాలి

: చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ చలివెందుల



పరిశ్రమలు పెడతామంటే మేం వ్యతిరేకించం. కానీ ఈగ్రామాల పరిధిలో దీర్ఘకాలిక వాణిజ్య పంటలు వక్క, మామిడితోపాటు మరికొన్ని పంటలున్నాయి. అలాంటి భూములు వదిలేసి న్యాయబద్ధమైన ధర చెల్లిస్తే భూములు ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

2013 భూసేకరణ చట్టం అమలు చేయాలి

: సిద్దారెడ్డి, రైతు సంఘం నాయకుడు, రాచపల్లి



2013భూసేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించాలి. మొదట కలెక్టర్, లేదా జాయింట్ కలెక్టర్ వచ్చి గ్రామసభలు ఏర్పాటుచేసి ధర ఎంత ఇస్తారో చెప్పాలి. ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో ప్రజలకు వివరించాలి. అలాకాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపి భూములు లాక్కుంటామంటే ఒప్పుకోం.

ఉన్న భూమినైనా వదిలేయండి : శివలింగారెడ్డి, రైతు



గతంలో హంద్రీనీవా కాలువ కోసం నాకున్న ఆరు ఎకరాల భూమిలో నాలుగు ఎకరాలు తక్కువ ధరకే తీసుకున్నారు. ఉన్న రెండెకరాల్లో పంటలు సాగుచేసి జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు మళ్లీ పరిశ్రమల పేరుతో భూమి తీసుకుంటే మా పరిస్థితి ఏంటి. ఇప్పుడు ఉన్న భూమినైనా వదిలేయాలి.

నేటి నుంచి పెదయ్యస్వామి ఉత్సవాలు

రెండురోజులపాటు నిర్వహణ

50వేల మంది హాజరవుతారని అంచనా

తాడిమర్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన ఆర్వేడుపట్నం పెదయ్యస్వామి జలధిపూజ, పెద్దమ్మ, యల్లమ్మ సాగు ఉత్సవాలను మంగళవారం నుంచి రెండు రోజులపాటు తాడిమర్రిలో నిర్వహించనున్నారు. కురుబ కులస్థులైన ఆర్వేటివారు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 3గంటలకు పుట్టకు పూజ చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి 11గంటలకు అమ్మవారి గంగపూజ, ఘటం ఊరేగింపు జరుగుతాయి. వివిధ గ్రామాల నుంచి హాజరయ్యే 25 రకాలగుడికట్ల స్వాములు మంగళవారం సాయంత్రం 5గంటలకే ఉత్సవ ప్రాంగణానికి చేరుకుంటాయని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. 8వ తేదీ తెల్లవారుజామున 4గంటల నుంచి 6గంటల వరకు ఆర్వేడు పట్నం పెదయ్యస్వామికి పుణ్యాహవచనం, గంగపూజ,రుద్రాభిషేకం, బిందే పూజ, మహామంగళహారతి, బలిహారం జరుపుతామన్నారు. ఈ ఉత్సవాలకు దాదాపు 50వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

ఆర్వేడుపట్నం పెదయ్యస్వామి ఉత్సవాల ఏర్పాట్లను ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ స్థానిక ఎస్ఐ క్రిష్ణవేణితో కలిసి పరిశీలించారు. సభాప్రాంగణం, స్వాములు భేటీ అయ్యే ప్రాంతం, పార్కింగ్‌స్థలం, అన్నదాన ఏర్పాట్లను పరిశీలించి స్థానిక సిబ్బందికి సూచనలు చేశారు. దాదాపు 150 మందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్‌ను కూడా మళ్లించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. పులివెందుల నుంచి ధర్మవరం వైపునకు వెళ్లే వాహనాలు చిల్లకొండయ్యపల్లిక్రాస్ నుంచి కునుకుంట్ల, మద్దెల చెరువు, తాడిమర్రి సబ్‌స్టేషన్ మీదుగా వెళ్లాలని ఎస్ఐ తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ హేమంత్ కుమార్

ఆగని ఆక్రమణలు

యథేచ్ఛగా కోడూరు మన్రో తోపులో కబ్జాలు

ఎక్స్‌కవేటర్‌తో స్థలాల చదును

అధికారుల హెచ్చరికలు బేఖాతరు

బరితెగించిన కబ్జారాయుళ్లు

చిలమత్తూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు మన్రో తోపులో ఆక్రమణలు ఆగడం లేదు. ఇటీవల 44వ జాతీయ రహదారితో పాటు 342 జాతీయ రహదారులు విస్తరణ జరుగుతుండటంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను అధికారులు తొలగించారు. అయితే ఆ దుకాణా దారులు పంచాయతీకి సంబంధించిన మన్రో తోపు భూమిలో ఆక్రమణలకు తెరలేపారు. గతంలో ఇదే మన్రో తోపులో స్థలాలను ఆక్రమించి, భవంతులు నిర్మించి వ్యాపారాలను చేసుకుంటూ వచ్చారు. ఇప్పుడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు తొలగించడంతో కొందరు మన్రో తోపులోని స్థలాలను కబ్జా చేయడానికి యత్నిస్తున్నారు. మన్రో తోపులో స్థలాల కబ్జా విషయంపై ఆంధ్రజ్యోతి పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దానికి పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి కబ్జా చేసిన స్థలాలను పరిశీలించారు. కబ్జా చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అయితే అధికారులు అలా వెళ్లారో లేదో అదే కబ్జారాయుళ్లు కోదండ రామాలయం సమీపంలో స్థలాలను యంత్రాల ద్వారా చదును చేయించారు. పంచాయతీ అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేశారు. వారం రోజుల కిందట కూడా కొందరు కబ్జాలకు పాల్పడటంతో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కబ్జారాయుళ్లు యథేచ్ఛగా సోమవారం ఎక్స్‌కవేటర్ల ద్వారా స్థలాలను చదును చేసుకున్నారు. దీనిపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోదండ రామాలయ ప్రాంగణమంతా కబ్జా చేస్తే భవిష్యత్తులో ఆలయ ఉత్సవాలను ఎలా జరుపుకోవాలని ప్రశ్నిస్తున్నారు. సెంటు భూమి ధర లక్షల్లో ఉంటున్న ఈ ప్రదేశంలో కబ్జాలు జరగడం విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ కోడూరు మన్రో తోపులో జరుగుతున్న ఆక్రమణలపై దృష్టి పెట్టి, అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



స్థలాలను చదును చేస్తున్న యంత్రాలు

కౌన్సెలింగ్ ఇచ్చాం: మునీర్ అహమ్మద్, ఎస్ఐ

వారం రోజుల కిందట మన్రో తోపులో జరిగిన ఆక్రమణలపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఫిర్యాదు చేశారు. ఆక్రమణలకు పాల్పడిన వారిని స్టేషన్‌కి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం. అయితే సోమవారం జరిగిన ఆక్రమణలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

బేగం అక్తర్ (జయంతి)




'మల్లికా ఏ ఘజల్'గా పేరొందిన బేగం అక్తర్ 1914 అక్టోబరు 7న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఫైజాబాద్ ప్రాంతంలో జన్మించారు. హిందూస్థానీ క్లాసికల్ మ్యూజిక్‌లో గజల్స్, దాద్రా, తుమ్రిల ఆలాపనలో పేరొందిన గాయనీమణి. చాలావరకు ఆమె తన పాటలకు తానే స్వరకల్పన చేసుకోవడం విశేషం. ఆలిండియా రేడియలో 400 దాకా పాటలు పాడిన ఘనత ఆమెది. 1930 దశకంలో కొన్ని హిందీ సినిమాల్లో నటించడమే కాక తన సినిమాలకు తానే పాడారు. గాత్ర సంగీతంలో సంగీత నాటక అకాడమీ, పద్మశ్రీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1974 అక్టోబరు 30న కన్నుమూశారు. మరణానంతరం పద్మభూషణ్ ప్రకటించారు.

డీవీజీ (వర్ధంతి)



డీవీజీగా పేరొందిన దేవనహళ్ళి వెంకటరమణయ్య గుండప్ప 1887 మార్చి 17న జన్మించారు. రచయిత, కవి, పాత్రికేయుడిగానే కాక తత్వవేత్తగా రాణించారు. ఆధునిక కన్నడ సాహిత్యంలో తనదైన ముద్రను చాటారు. ఆయన రచనలలో 'మంకు తిమ్మన కగ్గ' ఎంతో పేరొందింది. కన్నడ పత్రికలు భరత్, కర్ణాటకతోపాటు వారపత్రిక 'సుమతి'ని ప్రారంభించారు. భగవద్గీత తాత్పర్యాలపై రాసిన 'జీవన ధర్మయోగ'కు సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. ఆయన రచనలపై దాదాభాయ్ నౌరోజీ, గోపాలకృష్ణ గోఖలేల ప్రభావం అధికంగా ఉండది. 1975 అక్టోబరు 7న కన్నుమూశారు. 1988లో ఆయన స్మారక పోస్టల్‌స్టాంప్ విడుదలైంది.

వ్లాదిమిర్ పుతిన్ (పుట్టినరోజు)



వ్లాదిమిర్ పుతిన్ 1952 అక్టోబరు 7న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జన్మించారు. రష్యా దేశ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. న్యాయవాదిగా పట్టా అందుకున్నాక లెఫ్టినెంట్ కల్నల్ హోదా (కమిటీ ఫర్ స్టేట్ సెక్యూరిటీ)లో దాకా చేరుకున్నారు. 2008లో రష్యాదేశ ప్రధానమంత్రి అయ్యారు. క్రీడలపై ఆసక్తితో మార్షల్ ఆర్ట్స్‌లోనూ ట్రైనింగ్ పొందారు. పలు దేశాల నుంచి ఆయన గౌరవ పురస్కారాలు, డాక్టరేట్ అందుకున్నారు. సెకండ్ లాంగెస్ట్ యూరోపియన్ ప్రెసిడెంట్‌గా గుర్తింపు పొందారు.

సంగీతా కట్టి కులకర్ణి (పుట్టినరోజు)



హిందూస్థానీ సంగీతంలో ప్రసిద్ధి చెందిన సంగీత కట్టి కులకర్ణి 1970 అక్టోబరు 7న ధారవాడలో జన్మించారు. బాల్యం నుంచే సంగీతంపై ఆసక్తితో రాణించారు. ప్రత్యేకించి గాత్ర సంగీతంతోపాటు భజనలు, వచనాలు, దాసవాణి, అభంగ్, జానపదం, భగవద్గీత సహా పలు భాషల్లో నేపథ్యగాయనిగా రాణించారు. ఆలిండియా రేడియో, టీవీల్లోనూ 'ఏ' గ్రేడ్ కళాకారిణి. దేశవ్యాప్తంగా 700 కుపైగా కచేరీలు నిర్వహించారు. సువర్ణ కర్ణాటక రాజ్యోత్సవ అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల

అమరాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో 40 మంది వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై హేమావతి, గొల్లమారనపల్లి పంచాయతీకి చెందిన రంగనాథ్, కిరణ్‌కుమార్, శివన్నతో పాటు 40మంది వైసీపీకి రాజీనామాచేసి మడకశిర టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్, గొల్లమారనపల్లి రామచంద్రప్ప, తిప్పజ్జ, కృష్ణమూర్తి, నాగరాజు, శివకుమార్, కృష్ణప్ప, రంగస్వామి, డీలర్ తిరుమలగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ గౌడరంగప్ప, అంజినప్ప, చిక్కన్న పాల్గొన్నారు.

అనధికార వధశాల కూల్చివేత



మోతుకపల్లి వద్ద పశువధశాలను కూల్చివేస్తున్న దృశ్యం

హిందూపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మోతుకపల్లి సమీపంలో అనధికారికంగా నిర్వహిస్తున్న జంతు వధశాలను అధికారులు కూల్చివేశారు. రెండ్రోజుల క్రితం పశువులను తీసుకెళ్లి వధించడానికి సిద్ధంగా ఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు, మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించగా వధశాలకు అనుమతిలేదు. అక్కడున్నవారికి హెచ్చరించి సోమవారం మున్సిపల్ అధికారులు పోలీసుల సహకారంతో అన్నింటిని కూల్చివేశారు. రహమత్‌పురంలో అనధికారికంగా వైసీపీ నాయకుడు పశువధశాలను నిర్వహిస్తున్నాడు. దీనిని కూడా కూల్చివేశారు. కొన్నేళ్లుగా హిందూపురంలో మాంసం వ్యాపారులు అనధికారికంగా జంతు వధశాలను నిర్వహిస్తూ మాంసాన్ని బెంగళూరు, హైదరాబాదుకు ఎగుమతి చేసేవారు. ఉన్నతాధికారులు ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు.

కోలార్, చిక్కబళ్ళాపుర జిల్లాలకు కృష్ణాజలాలు మళ్లించాలి

● సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ



హాజరైన అభిమానులు

చింతామణి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కోలార్, చిక్కబళ్ళాపుర జిల్లాలకు శాశ్వత నీటి వనరులు లేవని కృష్ణాజలాల మళ్లింపుతోనే ఉమ్మడి జిల్లాల ప్రజలకు తాగు, సాగు నీరు అందుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ అభిప్రాయపడ్డారు. గోపాలగౌడ 75వ జన్మదిన వేడుకలు చింతామణి పరిధిలోని చెన్నసంద్ర వద్ద భారీ జనసందోహం మధ్యన జరిగాయి. కార్యక్రమానికి కేంద్రమంత్రి సోమణ్ణ, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కోలార్ ఎంపీ మల్లేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే ఎం కృష్ణారెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. జన్మదిన వేడుకలతో పాటు అభిమాన నటుడిని చూసేందుకు ఏకంగా 30వేల మందికి పైగా ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. వేదికపై మాజీ జస్టిస్ గోపాలగౌడను ప్రత్యేకంగా సత్కరించారు. ఇదే సందర్భంగా గోపాలగౌడ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలకు శాశ్వతంగా కృష్ణాజలాలు తీసుకువచ్చేందుకు 'జలాగ్రహ' పేరుతో పోరాటం చేసేందుకు సిద్ధం అయ్యామన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఒప్పించి నీటిని తీసుకువచ్చేందుకు పవన్‌కల్యాణ్ సహకరిస్తారననే నమ్మకం ఉందన్నారు. ఇదే సందర్భంగా ఏపీ డీసీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ కర్ణాటక అంటే ఎంతో చరిత్ర పరంపర కలిగి రాష్ట్రమన్నారు. ఇదే గడ్డపై పుట్టిన భారతరత్న సర్ ఎం విశ్వేశ్వరయ్య సాధనలు నేటికీ దేశమంతటా కొనియాడేలా ఉన్నాయన్నారు. జాతీయ కవి కువెంపు రచనలంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. సుప్రీం న్యాయమూర్తి వంటి ఉన్నతమైన హోదాలో పనిచేసినా గోపాలగౌడ నిరంతరం పేదల పక్షాన నిలబడినవారన్నారు. మహిళలు, రైతులు, కార్మికులు, పర్యావరణం వంటి అంశాలలో నాభావనలు గోపాలగౌడ ఆలోచనలకు తగ్గట్టుగా ఉన్నాయని పలు విషయాల్లో ఇద్దరిదీ ఒకే అభిప్రాయమన్నారు. జన్మదిన వేడుకలకు ఆహ్వానించగానే వస్తానని మాట ఇచ్చానన్నారు. సినిమాలలో బిజీగా ఉన్నప్పుడే రాజకీయాలలోకి వచ్చానని గతంలో ఓటమి చెందినప్పుడు తనను ప్రత్యేకంగా పలకరించి ధైర్యం చెప్పినవారిలో గోపాలగౌడ ఒకరన్నారు. రాష్ట్రాల మధ్య సరిహద్దులనేవి కేవలం కొలతలకు మాత్రమేనని ఇరు రాష్ట్రాల సంస్కృతి సంబంధాలు, ప్రేమాభిమానాలు శాశ్వతమన్నారు. కన్నడిగులు, తెలుగువారిది సోదర సంబంధమని దశాబ్దాల కాలంగా ఎన్నోవిధాల తెలుగువారిని కన్నడిగులు ప్రత్యేక అభిమానం చూపారన్నారు. ఇక్కడి ప్రజలకు శాశ్వత తాగునీటి విషయంలో తన వంతు సంపూర్ణంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వేలాది మంది పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ హెలీక్యాప్టర్ ద్వారా చింతామణికి చేరుకునేసరికే పెద్దఎత్తున ప్రజలు చేరారు. పవన్ జిందాబాద్ అంటూ కేరింతలు కొట్టారు. ప్రతి చోటా పవన్ అభిమానుల సందడే కనిపించింది.

ఇచ్చిన మాటను నెరవేర్చిన ఘనత కూటమిదే

● ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అమరాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వీరశైవ కల్యాణమండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయ కమిటీవారిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరో ఒకరి చేతుల్లో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని పెట్టుకుని తమ ఆధిపత్యాన్ని వైసీపీ నాయకులు చలాయించారన్నారు. 150ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని శిథిలావస్థకు తెచ్చారని ఆరోపించారు. ఎన్నికల్లో తమకు అండగా నిలిచి గెలిపించిన ఆర్యవైశ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దేవదాయ శాఖ అధికారులతో చర్చించి ఆలయాభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్, తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ రామారావు, దాదాపీర్, నరసింహమూర్తి, జయకుమార్, నాగరాజు, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

మడకశిర టౌన్ (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకున్నపుడే వారు భవిష్యత్తులో మంచి క్రీడాకారులగా రాణిస్తారని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామితో కలసి మహాత్మాగాంధీ లెదర్ బాల్ టీ20 క్రికెట్ విజేతలకు బహుతమతులు అందజేశారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా మడకశిర సింహగిరి జట్టు నిలువగా రూ.30వేలతో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నర్స్ సోమందేపల్లి జట్టుకు రూ.20 వేలు, ట్రోఫీని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాల వల్ల యువతలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ప్రాంతాలకు పేరు రావాలన్నా, గ్రామీణ అభివృద్ధి చెందాలన్నా క్రీడలు కూడా దోహదపడతాయన్నారు. క్రీడాభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని పోటీలు నిర్వహించడం వల్ల మడకశిర ప్రాంతానికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పుట్టకామప్ప, బలరామ్, నాగేంద్ర పాల్గొన్నారు. రొళ్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తూకం, జీఎస్టీపై డీలర్లకు అవగాహన కల్పించారు. పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రతి డీలరు బియ్యాన్ని తూకం సరిగా వేయాలని సూచించారు. రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

వాల్మీకి అడుగు జాడల్లో నడుద్దాం: ఎంపీ



సంఘీభావం తెలుపుతున్న ఎంపీ అంబికా, వెంకటేశ్వర్లు, వాల్మీకి సంఘం నాయకులు

రొద్దం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజసేవ కోసం అహర్నిశలు కృషిచేసిన మహనీయుడు వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో నడుద్దామని అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం రొద్దంలో వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా ఎంపీ, మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. విగ్రహావిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు టీడీపీ కృషిచేస్తుందన్నారు. సమాజసేవకోసం ప్రతి వాల్మీకి పాటుపడాలని పిలుపునిచ్చారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణ, నాయకులు చంద్రశేఖర్, డీసీ అంజనేయులు, చంద్రశేఖర్, నరహరి, వై.చంద్రశేఖర్, వాల్మీకి పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోండి



పోస్టర్లు విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే పీఏ

హిందూపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 10వ తేదీన ఎస్డీజీఎస్ కళాశాలలో జరిగే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర కోరారు. సోమవారం మెగాజాబ్‌మేళాకు సంబంధించి మునిసిపల్ కార్యాలయం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 15 బహుళ జాతీయ కంపెనీలు జాబ్‌మేళాకు వస్తున్నాయని, హిందూపురం నియోజకవర్గంతోపాటు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10వ తరగతి ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన విద్యార్థులు 18-35ఏళ్లలోపు వారు అర్హులన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ శివప్రసాద్, చేనేత జౌళిశాఖ ఏడీ రామక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, బాలాజీ, పవన్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కేరళ మాజీ డీజీపీ

మడకశిర రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ శ్రీరామిరెడ్డి జయంతి సందర్భంగా వారం రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా కేరళ రాష్ట్ర మాజీ డీజీపీ సయ్యద్ మహమ్మద్ యాసన్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొన్నారు. విన్నర్స్‌గా నీకంఠాపురం ఉన్నత పాఠశాల జట్టు, రన్నర్స్‌గా రొళ్ళ గురుకుల పాఠశాల నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థు నగదు బహుమతులు అందజేశారు. గోవిందపురం, గంగుళవాయిపాళ్యం పంచాయతీల్లో ఉత్తమ రైతులకు నగదు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కేటీ శ్రీధర్, పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపండి

పెనుకొండ టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కోర్టులో పరిష్కారమయ్యే వరకు మా భూమిలో అక్రమ నిర్మాణాలు ఆపాలని బాధితులు కుల్లాయప్ప, హుస్సేన్‌బీ కోరారు. సోమవారం ఆర్డీఓకు వారు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ సోమందేపల్లి మండలం సర్వేనంబరు 145-1లో 4.87ఎకరాల్లో 20ఏళ్ల నుంచి సాగుచేస్తున్నామన్నారు. గతంలో హంద్రీనీవా కాలువకు సగం పోయిందన్నారు. ఎకరం భూమికి 2015లో పట్టా ఇచ్చారని, అందులోనే ఇల్లుకట్టుకుని వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల గొల్ల మహేష్, గొల్ల రాజగోపాల్ తదితరులు వ్యవసాయ పొలంలో గుడికడతామని రాత్రికి రాత్రే షెడ్డువేశారని, దీనిపై కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు తీర్పు ఇచ్చేంతవరకు నిర్మాణ పనులు ఆపాలని ఆర్డీఓను కోరామన్నారు.

భూ రీ సర్వేపై ర్యాలీ

పరిగి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గతంలో నిర్వహించిన భూరీసర్వేపై మండల వ్యాప్తంగా రైతులు అవగాహన కలిగించే విధంగా పి. నర్సాపురం గ్రామంలో తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రీసర్వేలో రైతులకు ఎటువంటి తప్పులు లేకుండా సరిహద్దులు చేయించామన్నారు. రైతులకు రీసర్వేపై ఏవైనా తప్పొప్పులుంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అనంతరం గ్రామసభ నిర్వహించి రైతులు, ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, ఆర్ఐ సిద్దేశ్, మాజీ ఎంపీటీసీ సోమప్ప పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యంతో లక్ష్యాన్ని చేరుకోవాలి

● సీ-డాట్ కంపెనీ డైరెక్టర్ దిలీప్ కృష్ణస్వామి

బెంగళూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శక్తిసామర్థ్యాలతో చదువులో నైపుణ్యత సాధించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సీ-డాట్ కంపెనీ డైరెక్టర్ దిలీప్ కృష్ణస్వామి అభిప్రాయపడ్డారు. సోమవారం రామయ్య ఇంజనీరింగ్ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరం తరగతులను ప్రారంభించారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్న సమావేశంలో దిలీప్ కృష్ణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు కృత్రిమ మేధస్సును అన్నింటికీ వినియోగించరాదని సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకునే దిశగా ఉండాలన్నారు. ఎంపిక చేసుకున్న కోర్సుపట్ల అభిమానం ఉండాలి కానీ మారుతున్న సాంకేతిక యుగంలో ఏవిధంగా ప్రగతి సాధించాలనేది ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. డీఎస్‌వి బిజినెస్ అష్యూరెన్స్ ముఖ్యులు నందకుమార్ మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదివానని అధ్యాపకులు మార్గదర్శకాలతోనే మీ ముందుకు వచ్చి నిలబడి సాధనలు చెప్పగలుగుతున్నట్లు అభిప్రాయపడ్డారు. కళాశాల ఉత్తమ ప్రయోగశాలగాను క్రీడా మైదానంగాను మేధస్సు పొందే కేంద్రంగాను వినియోగించుకోవాలన్నారు. ఏ కోర్సు ఎంపిక చేసుకున్నావనేదాని కంటే ఏ కళాశాలలో చదివావు అనేది ముఖ్యం కానుందన్నారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎంఆర్ సీతారాం మాట్లాడుతూ రామయ్య ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభించాక ప్రస్తుతం 64వ బ్యాచ్‌కు శ్రీకారం చుట్టామన్నారు. గుణాత్మక విద్యకు ప్రాధాన్యత ఇచ్చినందుకే మనుగడతో పాటు పూర్వవిద్యార్థుల సాధనలకు కారణమైందన్నారు. ఇక్కడ చదివినవారు గ్రూప్ పరీక్షలలో రాణించినవారు ఎంతోమంది ఉన్నారన్నారు. కొత్తగా చేరిన విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తు కోసం పోటీపడాలని పిలుపునిచ్చారు. గోకుల ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షులు ఎంఆర్ జానకిరాం, కార్యదర్శి ఎంఆర్ ఆనందరామ్, డైరెక్టర్ ఎంఆర్ కోదండరామ్, ప్రిన్సిపాల్ ఎన్‌విఆర్ నాయుడు, డాక్టర్ హెచ్‌వి పాశ్వనాథ్, డాక్టర్ కరిసిద్దప్పతో పాటు పలువురు పాల్గొన్నారు.



దిలీప్ కృష్ణస్వామిని సత్కరిస్తున్న గోకుల ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంఆర్ సీతారాం

క్రాంతి లేదు.. భ్రాంతి లేదు: సీఎం

బెంగళూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గడిచిన కొన్ని నెలలుగాం రాష్ట్ర రాజకీయాల్లో నవంబరు సంచలన మార్పులకు కారణం కానుందనే వ్యాఖ్యలు తరచూ వినిపిస్తున్న విషయం తెలిసిందే. గతంలో మాజీ మంత్రి రాజణ్ణతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఇటువంటి వ్యాఖ్యలే చేశారు. వాటన్నింటినీ తిప్పికొట్టేలా సీఎం సిద్దరామయ్య సోమవారం మాట్లాడారు. కొప్పళ జిల్లా పర్యటనలో మీడియాతో మాట్లాడిన ఆయన నవంబరులో ఎటువంటి క్రాంతి కానీ భ్రాంతి కానీ లేవన్నారు. అన్ని కులాల ప్రజల ఆర్థిక సామాజిక, విద్యా పరమైన వివరాలు సేకరించేందుకు సర్వే జరుపుతున్నామన్నారు. అంతకు మించి ఏ కులానికి చెందినవారిని తొక్కేదికానీ మరేతర కులాన్ని పైకి ఎగదోసేది కానీ లేదని తేల్చి చెప్పారు. సమగ్ర వివరాలు సేకరించి బహిరంగం చేయడాన్ని తొక్కడం అంటే ఎలాగని ప్రశ్నించారు. ఆదివారం దాకా సర్వే 63శాతం పూర్తి అయ్యిందని మంగళవారంతో సాధారణ గడువు ముగియనుందని అవసరమైతే మరికొన్ని రోజులు పెంచుతామన్నారు. కొప్పళ జిల్లాలో 97శాతం కులగణన సర్వే పూర్తి అయ్యిందన్నారు. కొప్పళలోని బల్డోటా పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి కోర్టులో వివాదం ఉన్నందున మాట్లాడలేనంటూ దాటవేశారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి తాను కులగణన సర్వేలో పాల్గొనేది లేదని ప్రకటించిన అంశంపై స్పందిస్తూ త్వరలోనే కేంద్రప్రభుత్వం కూడా కులగణన సర్వే చేయదలచిందని అప్పుడు వ్యతిరేకిస్తారా అంటూ ప్రశ్నించారు. లింగాయత ప్రత్యేక మతం అనేది ప్రజల నిర్ణయానికి తాను అంగీకరిస్తానన్నారు. గ్యారెంటీలు సమగ్రంగా అమలు చేస్తున్నామన్నారు. కొన్ని దగ్గుమందులు వాడటం ప్రమాదమనే అంశమై వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పర్యవేక్షించాలని ఆదేశించానన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు తగదు

● కూటమి నాయకులు



మాట్లాడుతున్న కూటమి నాయకులు

గోరంట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డ్ ప్రియాంక బాయి ఆత్మహత్యాయత్నం ఘటనపై వైసీపీ జిల్లా అధ్యక్షులు ఉష శ్రీచరణ్ మంత్రి సవితపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, రాజకీయ లబ్ధికోసమే లేనిపోని నిందలు వేస్తున్నారని కూటమి నాయకులు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆత్మహత్యాయత్నం ఘటనపై మంత్రి సవిత పార్టీ నాయకులతో సంప్రదించారని, చర్యలు చేపట్టే విషయమై పోలీసులకు తగిన సూచనలు ఇచ్చినట్లు రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్ తెలిపారు. మంత్రి జోక్యం చేసుకోలేదని అనడం సబబు కాదన్నారు. మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాగే నాయక్, రవీంద్ర నాయక్, నిమ్మల శ్రీధర్, బెల్లంచెరువు చంద్ర మహమ్మద్, సురేష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట వైసీపీ ఆందోళన



నినాదాలు చేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, నాయకులు

గోరంట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన ప్రియాంకబాయికి మద్దతు పలుకుతూ వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గోరంట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. గోరంట్లలో పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ప్రియాంకబాయి ఇద్దరు ప్రవేటు కారు డ్రైవర్లు తనను వేధిస్తున్నారంటూ సెల్ఫీ వీడియోతో విషదాప్రకం తాగి ఆదివారం ఆత్మహత్య యత్నానికి యత్నించిన విషయం తెలిసిందే. వైసీపీ అధ్యక్షురాలు పార్టీ అనుచరులతో కలసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి హోంగార్డు ఘటనపై సీఐ శేఖర్‌తో వాగ్వాదానికి దిగారు. ఘటనపై కేసు ఎందుకు నమోదు చేయలేదని, నిందితులను ఎందుకు శిక్షించలేదని ప్రశ్నించారు. హోంగార్డు భార్య, భర్తల మధ్య విభేదాలు ఉండడంతోనే కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెబుతుండగానే ఆమె అడ్డుపడ్డారు. అనంతరం స్టేషన్ బయటకు వెళ్లి రోడ్డుపై నాయకులు బైఠాయించి ధార్నా చేపట్టారు. మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, దీనిపై ఎస్పీ ఫిర్యాదు చేస్తామన్నారు. బంజార సంఘం నాయకులు ఆంజనేయులు నాయక్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చెట్లను నరికేస్తున్న ట్రాన్స్‌కో కాంట్రాక్టర్లు



తురకలాపట్నం గ్రామం వద్ద చింతచెట్ల కొమ్మలను నరికేసిన దృశ్యం

రొద్దం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఒక చెట్టు కొమ్మ కొట్టాలంటే సవాలక్ష అనుమతులు తీసుకోవాల్సి ఉండగా రోడ్డుపక్కనే ఉన్న చెట్లను అడ్డంగా నరికేస్తున్నారు ట్రాన్స్‌కో కాంట్రాక్టర్లు. మండలంలోని తురకలాపట్నం, బొక్సంపల్లి గ్రామాల్లో రోడ్డుపక్కనే విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. కడపకు చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ సంస్థవారు విద్యుత్ స్తంభాలు, వైర్లు వేస్తున్నారు. రోడ్డుపక్కనే ఉన్న 15ఏళ్లనాటి చెట్ల పెద్దకొమ్మలు నరికేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా నిబంధనలు ఉల్లంఘించి చెట్లను నరికేస్తున్నారన్న విమర్శలున్నాయి. అక్కడే కాంట్రాక్ట్ పనులు చేస్తున్న సిబ్బందిని విచారించగా అనధికారికంగా అనుమతులు పొందామన్నారు. దీనిపై తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజును వివరణ కోరగా రెవెన్యూశాఖ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని ఘటనా స్థలాన్ని పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	13,092	14,662
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12,580	14,422
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77



ప్రమాదంలో నుజ్జయిన కారు

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడి మృతి

బళ్లారి సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నుంచి బెంగళూరు వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీ కొన్న ప్రమాదంలో తల్లీ కుమారుడు మృత్యువాత పడ్డారు. ఆదివారం సాయంత్రం బెంగళూరుకు చెందిన ప్రీతి(35), ఆమె కుమారుడు యశ్విత్ (1సంవత్సరం 10నెలలు) మరణించారు. ఏడుగురు గాయపడ్డారు. జాతీయ రహదారి 50లో కూడ్లిగి తాలూకాలోని బనవికల్లు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. బెంగళూరు నివాసి మోహన్ కుమార్ తన కుటుంబసభ్యులతో మంత్రాలయం దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని కానహొసహళ్ళి పోలీసులు తెలిపారు. మోహన్ కుమార్ కారు నడుపుతున్నాడు. వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన భార్య, కుమారుడిని చికిత్స నిమిత్తం కూడ్లిగి ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక ఆస్పత్రిలో మృతి చెందారు. గాయపడిన మోహన్‌కుమార్, రాధ, మరిరంగయ్య, రూప. లక్ష్మీదేవి, చరిత్,మిధున్ చిత్రదుర్గ, దావణగెరె ఆసుపత్రులో చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు.

నేడు ప్రమాణ స్వీకారం

కొత్తచెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మార్కెట్‌యార్డ్ ఛైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన పూల శివను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దీంతో 16 మంది మార్కెట్‌యార్డ్ డైరెక్టర్లతో పాటు పూలశివ ఛైర్మన్‌గా మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

కొట్టేసిన కారు దొరికింది

● రికవరీ వాహనాలను యజమానులకు అప్పగించిన ఎస్పీ

బళ్లారిరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని బ్రూస్ పేట పోలీస్ స్టేషన్లో పరిధిలో మహమ్మద్ జహీద్ బాష అనే నిందితుడు అద్దె పేరుతో కార్లను తీసుకుని మాయం చేసిన సంగతి తెలిసిందే. పలు వాహనదారులకు సంబంధించిన యజమానుల నుంచి ప్రతి నెల 40 నుంచి రూ. 50 వేలు ఇస్తానని మోసానికి పాల్పడ్డాడు. దీంతో పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ డాక్టర్ శోభారాణి ఆదేశాలతో బళ్లారి సర్కిల్ బ్రూస్ పేట ఇన్స్‌పెక్టర్లు మాంతేష్ నేతృత్వంలో ప్రత్యేక బృందం విచారణ చేపట్టారు. జీపీఎస్ కనెక్షన్ సహాయంతో 44 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమానులకు సోమవారం పోలీసు డీఆర్ గ్రౌండ్ మైదానంలో ఎస్పీ చేతుల తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనాలు అద్దెకు ఇచ్చే సమయంలో యజమానులు జాగ్రత్త పాటించాలని, సరైన ధ్రువపత్రాలతో వాహనాలు అప్పజెప్పాలన్నారు. పేద ప్రజల కార్లు, బడుగుల వల్ల జీవనోపాధి చేసుకోవచ్చనే ఆశతో ఎందరో కొందరు మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడతారని దీనిపై అనుమానాస్పద వ్యక్తులను గమనించి సంబంధిత తెలిసిన వారికే వాహనాలు ఇవ్వాలన్నారు. మరిన్ని వాహనాలను వీలైనంత త్వరలో జీపీఎస్ కనెక్షన్ల ద్వారా పోలీసు సిబ్బంది స్వాధీనం చేసుకుంటారన్నారు.



వాహనాలు అప్పగిస్తున్న ఎస్పీ శోభారాణి

వైద్యుల సూచన మేరకే దగ్గు మందులు వాడాలి

● సీఈఓ మహమ్మద్ హారీస్



బళ్లారి సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు దగ్గు మందు వాడరాదని, 2నుంచి 5సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు వైద్యుల సూచన మేరకే మందులు వాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లాపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ హారీస్ వైద్య అధికారులను ఆదేశించారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన పిల్లలకు దగ్గు నుంచి ఉపశమనం కోసం ఇచ్చే కొన్ని రకాల సిరఫ్‌ల వల్ల మరణాలు సంభవిస్తున్న ఘటనలు బయట పడుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బళ్లారి జిల్లాలో అవసరమైన చర్యలు తీసుకున్నామ అన్నారు. ఏదైనా ప్రైవేట్ ఆసుపత్రిలో మందులను పరిశీలించాల్సిన బాధ్యత వైద్యాధికారులదేనన్నారు. జిల్లాలోని ఏ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు కోల్డ్ సిరప్ సరఫరా చేయడంలేదు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లా అంతటా శాఖ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలు వైద్యులు ఇచ్చిన సలహా మేరకు మందులు వాడాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్ బాబు కోరారు.

అభివృద్ధికి నోచుకోని కళ్యాణ కర్ణాటక: వెల్ఫేర్ పార్టీ

బళ్లారి సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి 78సంవత్సరాలు గడిచినా కళ్యాణ కర్ణాటక అభివృద్ధి చెందలేదు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన కళ్యాణ కర్ణాటకకు 2013లో 98వ రాజ్యాంగ సవవరణ ద్వారా సెక్షన్ 371జే కింద ప్రత్యేక హోదా ఇవ్వబడింది కాని అభివృద్ధి చెందలేదని వేల్ఫేర్ పార్టీ బళ్లారి జిల్లాయూనిట్ అధ్యక్షుడు సయ్యద్ అహమ్మద్ హుశ్శేన్ అన్నారు. సోమవారం నగరంలోని పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కళ్యాణ కర్ణాటకకు 12సంవత్సరాల్లో 25వేల కోట్ల నిధులు విడుదల చేసినా ఫలితం శూన్యమన్నారు. విద్యావంతులైన యువతకు ఉపాధి దొరకలేదు. జనాభా ప్రకారం ఆరోగ్య కేంద్రాలు లేవు, పాలిచ్చే తల్లులు పిల్లలు పోషకాహార లోపం కారణంగా మరణిస్తున్నారు. ఆహార దాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వెనుకబడిన మైనార్టీ దళిత గిరిజన ప్రజలకు సామాజిక న్యాయం ఇప్పటికీ అందుబాటులో లేదు. ప్రభుత్వం ప్రతీసారీ కొత్తపథకాలను అమలు చేసి పెద్ద గ్రాంట్లను ప్రకటించింది. కానీ ఈ ప్రాంతానికి ప్రయోజనం చేకూరలేదు.కళ్యాణ కర్ణాటక ప్రాంతాలైన కొప్పల్, రాయచూర్,యాదగిరి కలబుర్గి జిల్లాలు అత్యంత వెనుకబడిన జిల్లాలని అన్నారు. ఈజిల్లాలో గత నాలుగు సంవత్సరాలలో సుమారు 9000 మంది శిశువులు, 600మంది తల్లులు పోషకాహార లోపం కారణంగా మరణించారు. జిల్లా ఖనిజ ఫౌండేషన్ నిధితో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి పెద్ద పరిశ్రమలను స్థాపించడానికి స్థానికులకు ఉపాధి అవకాశాలను అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ సాలియన్, సయ్యద్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వేల్ఫేర్ పార్టీ నాయకులు

గుర్తుతెలియని శిశువులను దత్తత కేంద్రంలో అప్పగించండి: కలెక్టర్



కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో గుర్తు తెలియని నవజాత శిశువులు కనిపిస్తే వారిని ప్రభుత్వ ప్రత్యేక దత్తత సంస్థకు అప్పగించాలని జిల్లాకలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ సూచించారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన ఎవరైనా తమకు జన్మించిన నవజాత శిశువు, అనాథ, వదిలివేయబడిన బిడ్డను చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు కాల్ చేసి సంబంధిత చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కానీ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారు బిడ్డను స్వీకరించి ప్రభుత్వ ప్రత్యేక దత్తత సంస్థలో నమోదు చేస్తారన్నారు. నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలోని శాంతిధామ్ ప్రాంగణంలోని ప్రభుత్వ ప్రత్యేక దత్తత సంస్థకు అప్పగించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను చెత్తబుట్టల్లో, రోడ్డు ప్రక్కన పారవేసి వారి మరణానికి కారణం కారాదన్నారు.

మసాజ్ సెంటర్లపై చర్యలు తీసుకోండి

● రాష్ట్ర మానవహక్కుల కమిటీ అధ్యక్షుడు ఉరుకుందరెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ ఉరుకుందరెడ్డి

బళ్లారిరూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో పలు హోటళ్లలో బాడీ మసాజ్ సెంటర్ల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నారని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవ హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం వినతిపత్రం అందజేసిన ఆయన బాడీ మసాజ్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ మహమ్మద్ జుబేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమెన్ రైట్స్ పదాధికారులు, మునాఫ్ పాటిల్, మంజునాథ పాల్గొన్నారు.


నేటితో కులగణన పూర్తి



కంప్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

కంప్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుపరిచిన సర్వే నేటితో పూర్తవుతుంది. సెప్టెంబరు 22న ప్రారంభం చేపట్టారు. అక్టోబరు 7న చివరి రోజుగా చేపట్టారు. ఈ 15 రోజుల్లో గ్రామాల్లో పట్టణాల్లో ప్రతి ఇంట ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇతరులు ప్రతి ఇంట సర్వే చేపట్టి దాఖలును అధికారులకు అప్పగించారు. కాకపోతే నెట్‌వర్క్ ప్రాబ్లమ్‌తో కొంతవరకు ఇబ్బందులు ఎదుర్కొని కూడా అప్పగించిన విధుల్ని సక్రమంగా నిర్వహించారు. సోమవారం కురుగోడు శిక్షణ అధికారి సిద్దలింగమూర్తి, కంప్లి పట్టణంలో పలు వార్డుల్లో సర్వే చేపట్టారు. వార్డులోని ప్రజలను జన గణిత సర్వే విషయంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చేపట్టారా లేదా అనే అంశంపైన ప్రభుత్వం ఆదేశించిన ఆదేశాల మేరకే ఈ 15 రోజుల్లోపు గానే అన్ని అంశాలపై సర్వే చేపట్టి దాఖలు చేపట్టామని తెలిపారు. వారితో పాటు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాల్మీకి జయంతి



కంప్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కంప్లి, కురుగోడు తాలుకాల్లో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేపట్టారు. వేడుకలకు వాల్మీకి సమాజ ప్రజలు తరలిరావాలని సంఘం తాలూకా అధ్యక్షుడు నీరగంటి వీరేష్, కురుగోడు అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ఇప్పటికే సముదాయ భవనాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం వాల్మీకి సర్కిల్ నుంచి ఊరేగింపు ఉధ్బవ గణపతి చేరుకుని అక్కడి నుంచి అంబేద్కర్ సర్కిల్, కురుగోడు రోడ్డు మీదుగా వాల్మీకి భవనానికి చేరుకుంటామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలోనే జయంతి కార్యక్రమం జరుపుకుంటున్నట్లు తెలిపారు. జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులను గుర్తించి సన్మానించి అభినందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని, పట్టణాల్లోని వాల్మీకి సమాజం బంధువులు జయంత్యుత్సవం ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిరుగుప్ప : వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గౌసియా బేగమ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. తాలుకా పరిపాలన, ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మహర్షి వాల్మీకి భావ చిత్రపటం ఊరేగింపు అనంతరం వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తప్పనిసరిగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

హోసూరు జోన్

రేషన్ సరుకులను సద్వినియోగం చేసుకోవాలి

● రేషన్ షాపు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాశ్



లబ్ధిదారులకు సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే చౌకధరల సరుకులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్ వినియోగదారులకు సూచించారు. సోమవారం హోసూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని శూలగిరి పంచాయతీ యూనియన్‌లోని పేరండపల్లి పంచాయతీలోని బాస్కర్‌దాస్ నగర్‌లో రేషన్ షాపును ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రజలకు రేషన్ బియ్యం, నూనె వంటి సామగ్రిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, యూనియన్ ఇన్‌చార్జి లోకేష్‌రెడ్డి, బత్తలపల్లి దేవరాజ్, సంపత్ కుమార్, ప్రభుత్వ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు

హోసూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హోసూరులో 9 వ సంవత్సరం జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. తంగవేల్ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ టోర్నమెంట్ నిర్వహించారు. కృష్ణగిరి జిల్లా నుంచి మొత్తం 25జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి పోచ్చంపల్లి పోలీస్ జట్టు రూ.20 వేలను గెలుచుకున్నారు. రెండవ బహుమతి డెంకణీకోట బ్లాస్టర్స్ జట్టు రూ.15 వేలు అందుకున్నారు. మూడవ బహుమతి మధుర్ స్ట్రైకర్స్ జట్టు రూ. 10 వేలు అందుకున్నారు. నాలుగో బహుమతి ఈగల్స్ స్పోర్ట్స్ క్లబ్ హోసూరు రూ.5 వేలు, ట్రోఫీ అందుకున్నారు. ఈగిల్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్ థాయుమానవన్ మరియు సెల్వం జిల్లా విద్యార్థి మండలి వైస్ ఆర్గనైజర్ విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలను పలువురు ప్రముఖులు అభినందించారు.

18నుంచి కళా ఉత్సవం

హోసూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 18నుంచి కళాఉత్సవం జరగనుంది. సోమవారం విలేకరులతో మాట్లాడిన ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యామణి కార్యక్రమ వివరాలు వెల్లడించారు. కళోత్సవంలో అన్ని విభాగాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. పోటీల్లో వెయ్యి మందికి పైగా విద్యార్థులు లలిత కళా మండలి నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. సమావేశంలో కళాశాల ఆర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ నందగోపాల్ మరియు డిప్యూటీ కో ఆర్డినేటర్లు డాక్టర్ మీనాప్రియ, , ఉషారాణి, పళనిస్వామి, డాక్టర్ కవిత, మరియు ప్రొఫెసర్లు, లక్చెరర్లు మరియు విద్యార్థులు పాల్గొంటారు.



మీడియాతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యమణి

సీఎం సభతో బస్సులకు కటకట

● సమయానికి రాక ఇబ్బంది పడ్డ ప్రయాణికులు



సీఎం సభకు తరలిస్తున్న బస్సు



గంగావతి బస్టాండ్‌లో సందడి

కంప్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య కొప్పళలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరుకావడంతో ఆర్టీసీ బస్సులకు కొరత ఏర్పడింది. ప్రజలను తరలించేందుకు బస్సులను పంపడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కొప్పాళ జిల్లాతో పాటు రాయచూరు బళ్లారి, విజయనగరం ఇతర జిల్లా నుండి వందల కొద్ది బస్సులు ముఖ్యమంత్రి కార్యక్రమానికి ప్రజల్లో తరలించేందుకు పంపడంతో ఈ సోమవారం ఆ జిల్లాలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడి తమ పాఠశాలకు కాలేజీలకు గమ్యానికి చేరుకున్నారు. ప్రైవేటు వాహనాల ఛార్జీలు ఆకాశాన్ని తాకాయి. నాయకుల సమావేశానికి బస్సులు మళ్లింపు చేయడంతో ప్రయాణికులకు ఎంతో ఇబ్బందికరంగా మారిందని వివిధ సంఘ సంస్థ నేతలు పేర్కొన్నారు. మున్ముందు ఇలా కాకుండా నాయకులు ముందుగానే ఏర్పాటు చేసుకున్న సమావేశం తేదీలను తెలుసుకుని ఆ రోజు ప్రభుత్వమే ప్రైవేటు వాహనాలకు, ప్రజలకు అనుగుణంగా ఏర్పాటు చేసి ప్రజలకు ప్రయాణికులకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేయాలని కోరారు.

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.84.94 లక్షలు

కదిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.84.94 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆలయంలోని హుండీ సొమ్మును సోమవారం లెక్కించారు. 51రోజులకుగాను ఈ మొత్తం నగదుతోపాటు 6 గ్రాములు బంగారం, అర కిలో వెండి, 67 అమెరికన్ డాలర్లు, 20 నేపాలీ రూపాయలు, 2,800 ఇండోనేషియా కరెన్సీ, 160 ధర్హంలు, 5 రియాళ్లు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది. స్వచ్ఛంద సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



హుండీ సొమ్ము లెక్కిస్తున్న భక్తులు

కృష్ణమ్మ నింపింది ఆనందం

మడకశిర రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ రాకతో మడకశిర ప్రాంతం పులకించిపోతోంది. హంద్రీ నీవా కాలువ ద్వారా వచ్చిన కృష్ణా జలాలతో మండలంలోని మణూరు చెరువు నిండడంతో సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి.. కృష్ణా జలాలకు హారతి ఇచ్చారు. బోటులో చెరువులో విహరించారు. అనంతరం వారు.. రైతులతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలతో చెరువులోకి దిగి, ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో హంద్రీనీవా కాలువలు నిర్వీర్యం చేశారన్నారు. కాలువల్లో మరమ్మతులు పూర్తి చేసి, చివరి నియోజకవర్గాలకు కూడా నీరివ్వడం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపిన తర్వాత సీఎం వచ్చి జలహారతి ఇస్తారన్నారు.



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలతో చెరువులోకి దిగి ఆనందం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు, రైతులు

క్రీడాకారులకు జేఎస్‌డబ్ల్యూ సహకారం



విజేత జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

తోరణగల్లు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులకు జేఎస్‌డబ్ల్యూ సంస్థ అండగా నిలుస్తోంది. దసరా పండుగ సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది టీఎంలు పాల్గొన్నాయి. క్రీడాకారులకు సమవస్త్రాలు పథకాలు మొదలగునవి సంస్థ సమకూర్చింది. ప్రధాన బహుమతిగా శ్రీ సాయిబాబా ఎంటర్‌ప్రైజెస్, రెండవ బహుమతి తోరణగల్లు కింగ్స్ జట్లు అందుకున్నాయి. ఈ సందర్భంగా బీజేపీ యువ ఉపాధ్యక్షుడు జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ విభాగం సంయోజనాధికారి మహమ్మద్ రఫీక్, పంచాయతీ సభ్యులు రవి, మంజునాథ్, కాంగ్రెస్ ప్రముఖులు శంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

31లోగా ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

సిరుగుప్ప, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): 2006-2007 సంవత్సరంలో భాగ్యలక్ష్మీ బాండ్లు పొందిన లబ్ధిదారులు నగదు జమ కోసం అక్టోబరు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం భాగ్యలక్ష్మీ బాండ్లు పొందిన లబ్ధిదారులకు నగదు జమ చేసుకోవడానికి పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలు వివిధ దాఖలాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.